సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



ఆర్‌ఎంపీలు పరిధి దాటొద్దు

ఆర్‌ఎంపీలు వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు. 8లో



ఉప్పొంగుతున్న వాగులు

ఇటీవలి వర్షాలతో జిల్లాలోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామాలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో గురువారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో ఈవో రమాదేవి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, మంత్రపుష్పం, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

అద్దె వాహనానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: జిల్లాలో ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కింద ఎంఎంయూ యూనిట్‌కు సంచార ఆరోగ్య బృందాలను తరలించేందుకు అద్దె వాహనం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు సీట్లు కలిగి, ఐదేళ్లలోపు వాహనం అయి ఉండాలని పేర్కొన్నారు. డ్రైవర్, కమ్ ఓనర్‌కు ప్రాధాన్యత ఉంటుందని, నెలకు రూ. 45 వేలు అద్దె చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 11న తమ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని కోరారు.

జేకే ఓసీకి అనుమతిస్తాం

అటవీ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ తరుణ్



ఆర్‌ఓ ప్లాంట్ వద్ద జీఎం, అధికారులతో తరుణ్

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలో ఏర్పాటు చేయనున్న జేకే ఓసీ అనుమతి విషయంలో సానుకూలంగా స్పందిస్తామని రాష్ట్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ కత్తుల తరుణ్ భరోసా ఇచ్చారు. గురువారం ఆయన ఇల్లెందు ఏరియాలో పర్యటించి జేకే ఓసీ ప్రాంతంలో రెమిడేషన్, సీసీ రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్, కమ్యూనిటీ హాల్ తదితర పనులతో పాటు డంప్ యార్డు, ప్లాంటేషన్, జేకే ఓసీని పరిశీలించారు. జేకే ఓసీకి సంబంధించిన ఇంకుడు గుంత, ఆయిల్, గ్రీస్ ట్రాప్, ఎయిర్ క్వాలిటీ మానిటర్ సిస్టమ్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గెస్ట్‌హౌస్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీఎం జాన్‌ఆనంద్, జనరల్ మేనేజర్(ఎన్విరాన్‌మెంట్) అయితమనోహర్, ఎస్‌ఓ టు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు కృష్ణమోహన్, పూర్ణచందర్, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

భద్రాచలం ఎమ్మెల్యేకు ఊరట

ఎన్నికల కేసు కొట్టేసిన కోర్టు

భద్రాచలం అర్బన్: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు స్థానిక ప్రథమ శ్రేణి కోర్టులో ఊరట లభించింది. 2018 ఎన్నికల సమయంలో ఆయనపై నమోదైన కేసును కొట్టేసింది. నాడు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన వెంకట్రావు.. ఆయన తరఫున ఓ వ్యక్తి ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలతో పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలో వెంకట్రావుపై పట్టణ పోలీసులు ఏ –2గా చార్జిషీట్ ఫైల్ చేసి కోర్టులో కేసు వేశారు. అయితే, తనపై కేసు కొట్టేయాలని ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో విచారించిన న్యాయస్థానం వెంకట్రావుపై నమోదైన కేసు కొట్టివేస్తున్నట్లు గురువారం వెల్లడించింది.

తొలి తూటా లచ్చన్న దంపతులకే?



ఎన్‌కౌంటర్ అనంతరం మావోయిస్టుల గుడారం వద్ద లభించిన ఆయుధాలు, తూటాలు

మావోయిస్టులపై రివార్డులు ఇలా..

పేరు	రివార్డు (రూ.లక్షల్లో)
లచ్చన్న ఆలియాస్ కుంజా వీరన్న	5
పూనెం లక్కే ఆలియాస్ తులసి	4
కొవ్వాసి రాము	4
దుర్గేశ్	4
పొడియం కోసయ్య ఆలియాస్ సుకురాం	1
కోసి ఆలియాస్ వెన్నెల	1
మాసయ్య	1

4వ తేదీ రాత్రి దోనాల గుట్టల్లో గుడారం

- పక్కా సమాచారంతో చుట్టుముట్టిన పోలీసులు
- గురువారం ఉదయం బయటకొచ్చిన లచ్చన్న, తులసి
- పోలీసులకు ఎదురుపడడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు !
- ఆరుగురు మావోయిస్టుల హతం.. తప్పించుకున్న మరో సభ్యుడు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ కరకగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కరకగూడెం ఎన్‌కౌంటర్‌లో తొలి తూటా లచ్చన్న దంపతులకే తగిలినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత జరిగిన కాల్పుల్లో ఇతర దళ సభ్యులు హతమయ్యారు.

అడవుల్లో బాంబుల మోత..

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తాడ్వాయి మండలం నుంచి బుధవారం రాత్రి కరకగూడెం మండలం రఘునాథపాలెం గ్రామానికి సమీపంలో ఉన్న దోనాల గుట్టల దగ్గరికి లచ్చన్న దళం చేరుకుంది. వర్షం పడుతుండడంతో రాత్రి గుట్టపై బస చేసేందుకు టార్పాలిన్ కవర్లతో గుడారం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటికే దళం బస చేసిన సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్నారు. సూర్యోదయం అయ్యాక లచ్చన్న, అతడి భార్య తులసి గుడారం విడిచి బయటకు వచ్చారు. దీంతో ఇరు వర్గాలు ఒకరికొకరు ఎదురుపడటంతో కాల్పులు మొదలైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో లచ్చన్న దంపతులే తూటా గాయాలకు ముందుగా ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. దళ నాయకుడు మృతి చెందడంతో ఇతర సభ్యులు అప్రమత్తమై కాల్పులు ప్రారంభించారు. ఈ క్రమంలో మావోయిస్టులు పేలుడు పదార్థాలను ప్రయోగించినట్టు తెలుస్తోంది. గంటకు పైగా ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. హోరాహోరీ ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి.

ఇంకో దళం ఉందా ?

జూలై 25న గుండాల మండలం దామెరతోగు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు. ఈ సందర్భంగా పోలీసులు జారీ చేసిన ప్రకటనలో దామెరతోగు అడవుల్లో భద్రు, లచ్చన్నతో పాటు 15 మంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత పోలీసులు జారీ చేసిన పోస్టర్‌లో లచ్చన్న దళానికి చెందిన ఏడుగురు సభ్యుల ఫొటోలు, వారిపై ఉన్న రివార్డులను పొందుపరిచారు. కరకగూడెం ఎన్‌కౌంటర్‌లో లచ్చన్నతో పాటు మరో ఐదుగురు దళ సభ్యులు మృతిచెందగా.. మాసయ్య తప్పించుకున్నాడు. దీంతో భద్రు దళం, మాసయ్య జాడ ఎక్కడనే అంశంపై చర్చ నడుస్తోంది.

నాలుగైదు రోజులు ఉండేలా..

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో పరిసరాలను పరిశీలిస్తే మావోయిస్టులు నాలుగైదు రోజులు బస చేసేందుకు వీలుగా పక్కా ఏర్పాట్లతో వచ్చినట్టు అర్థం అవుతోంది. గుడారం ఏర్పాటు చేసుకున్న స్థలంలో బియ్యం, పప్పులు, మంచినీళ్ల సీసాలు, వంట సామగ్రి కనిపించాయి. పోలీసు నిర్బంధం పెరగడంతో అనువైన సమయం చూసుకుని కరకగూడెం మీదుగా గోదావరి దాటి ఛత్తీస్‌గఢ్‌లోకి వెళ్లే ప్రయత్నాల్లో లచ్చన్న దళం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే వారు క్యాంపు ఏర్పాటు చేసుకున్న మరుసటి రోజే ఎదురుకాల్పుల్లో మరణించారు. మృతదేహాలను మణుగూరు ఆస్పత్రికి తరలించారు. కాగా, మాసయ్య అనే మావోయిస్టు ఈ కాల్పుల నుంచి తప్పించుకున్నాడని పోలీసులు తెలిపారు.

మళ్లీ కోవర్టు భయం

విప్లవ ద్రోహుల వల్లే ఎన్‌కౌంటర్ జరిగిందని భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ ప్రకటించడంతో మరోసారి ఏజెన్సీలో ఆందోళన నెలకొంది. కోవర్టు నెపంతో ఇటీవల మావోయిస్టులు హింసాకాండకు దిగుతున్నారు. నీల్సో ఆలియాస్ బంటి రాధను చంపి, చర్ల మండలంలో మృతదేహాన్ని పడేశారు. జిల్లా సరిహద్దులో ఉన్న బీజాపూర్, సుక్మా జిల్లాల్లో కోవర్టు, ఇన్‌ఫార్మర్ నెపంతో ఆరుగురిని హత్య చేశారు. ఇప్పుడు కరకగూడెం ఎన్‌కౌంటర్‌కు కోవర్టులే కారణమనే ప్రకటన మావోల నుంచి రావడంతో ఎప్పుడేం జరుగుతుందో అనే భయాందోళన వ్యక్తం అవుతోంది. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ గ్రామస్తుడిని కూడా పోలీసులు చంపారంటూ ఆజాద్ ఆరోపించారు.



ఘటనా స్థలానికి వెళ్తున్న ఎస్పీ రోహిత్ రాజ్



మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న సిబ్బంది

ఖాకీల గుప్పిట్లో కరకగూడెం 8లో

నిర్లక్ష్యం వీడని అధికారులు

- ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయని వైనం
- గల్లంతైన వ్యక్తి కోసం వెళ్లి వాగులో చిక్కుకున్న మరో ఐదుగురు
- బాధితులను కాపాడిన ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు



ప్రమాదం నుంచి బయటపడ్డాక అధికారులతో ఐదుగురు

పాల్వంచరూరల్: అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను అప్రమత్తం చేయకపోవడంతో మరో ఐదుగురు కిన్నెరసాని వాగులో చిక్కుకుపోయారు. దీంతో అధికారులతోపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు కిన్నెరసానివాగు, ముర్రేడు వాగుల్లో సంగం నుంచి ఏపీ రాష్ట్రంలోని కుక్కునూరు మండలం నగరం వరకు, రెండు వాగులు కలిసే ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గాలింపు చేపట్టాల్సి వచ్చింది. పాల్వంచ, బూర్గంపాడు మండలాల సరిహద్దులోని దంతెలబోరు గ్రామ సమీపంలో ఉన్న కిన్నెరసాని వాగులోకి పశువుల మేత కోసం, చేపలు పట్టేందుకు బుధవారం దంతెలబోరు, గంగదేవిగుప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు వెళ్లి వరదలో చిక్కుకుపోయారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఇతర అధికారుల పర్యవేక్షణలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది నాలుగు గంటలపాటు గాలించి ఆరుగురిని రక్షించారు. వరదలో చిక్కుకున్న పినపాక పట్టీనగర్‌కు చెందిన జారే సాయి(30) గల్లంతయాడు. రాత్రి కావడంతో గాలింపు నిలిపివేశారు.

గల్లంతైన వ్యక్తి కోసం వెళ్లి..

గల్లంతైన జారే సాయి ఆచూకీ కోసం గురువారం గంగదేవిగుప్ప గ్రామానికి చెందిన కుంజ భద్రయ్య, సోడే జాన్, సోడే వెంకటరత్నం, సోయం వెంకటేశ్వర్లు, ఉప్పుసాకకు చెందిన చేర్ప లవకుమార్ కిన్నెరసాని వాగులో గాలింపునకు వెళ్లారు. అదే సమయంలో కిన్నెరసాని రిజర్వాయర్ ఏడు గేట్లను ఎత్తి 56 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో వాగులో వరద ఉధృతి పెరిగి ఐదుగురు చిక్కుకుపోయారు. వాళ్లను రక్షించేందుకు డీడీఆర్‌ఎఫ్, అగ్నిమాపక బృందాలు మూడు బోట్లు వేసుకుని వాగులోకి వెళ్లాయి. వరద ఉధృతంగా ఉండటంతో కలెక్టర్ ఆదేశాలతో ఎత్తిన గేట్లను మధ్యాహ్నం 2.40 గంటలకు మూసివేశారు. వాగులో చిక్కుకున్న వారికి డ్రోన్ సహాయంతో ఆహారం, తాగునీరు అందించారు. నాలుగు గంటల తర్వాత వాగు ఉధృతి తగ్గాక బోట్ల సాయంతో వారిని దంతెలబోరు వైపు ఒడ్డుకు చేర్చారు.

లభించని సాయి ఆచూకీ



కిన్నెరసాని వాగులో గల్లంతైన సాయి ఆచూకీ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలకు చెందిన 20 మంది రెండు బోట్ల సహాయంతో వాగులో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 7 గంటల వరకు ఆరు గంటలపాటు గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ దొరకలేదు. అప్పటికే చీకటిపడటంతో గాలింపు నిలిపేశారు. రెస్క్యూ ఆపరేషన్‌ను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ నారాయణ, సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ సురేష్ పర్యవేక్షించారు.

పశువులు మేపేందుకు, చేపలకు వెళ్లి వాగులో చిక్కుకున్న వారిని బుధవారం రాత్రి ఎన్డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్ బృందాలు రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. వారిని గురువారం 'సాక్షి' పలకరించగా కన్నీటిపర్యంతమయ్యారు.

బతుకుతామనుకోలేదు



పశువుల మేత కోసం కిన్నెరసాని వాగులోకి వెళ్లాను. వెళ్లేటప్పుడు వాగులో వరద రాలేదు. తిరిగొచ్చే సమయంలో ఒక్కసారిగా వరద పెరగడంతో అక్కడే చిక్కుకుపోయాను. తిరిగి ఇంటికి వస్తాననుకోలేదు. అధికారులు బోటు సహాయంతో తీసుకురావడంతో బతికిపోయాను. –కుంజ భద్రయ్య, గంగదేవిగుప్ప

అధికారులే రక్షించారు..




కిన్నెరసాని వాగు వరద పెరగడంతో తిరిగి ఇంటికి వెళ్లడం కష్టమే అనిపించింది. నాతోపాటు మా ఊరువాళ్లు కూడా ఉండటంతో కొంత ధైర్యంగా ఉన్నా. అధికారులు వచ్చి తీసుకొచ్చారు. అధికారుల రూపంలో భగవంతుడు రక్షించాడు అనుకుంటున్నా. –మంచినీళ్ల మునలయ్య, గంగదేవిగుప్ప

ప్రాణాలు అరచేతిలో..



వాగులోకి పశువుల మేతకోసం వెళ్లాం. పశువులను తిరిగి ఇంటి తీసుకొస్తున్న సమయంలో వాగులో వరద పెరగడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నా. నాతోపాటు మరో ఆరుగురు అక్కడే ఉన్నారు. అందరం కలిసికట్టుగా ఉందామనుకున్నాం. –తటుకుల కేదారి, గంగదేవిగుప్ప

ఆశ కోల్పోయాం..



కిన్నెరసాని గేట్లు ఎత్తడంతో ఒకవైపు కిన్నెరసాని వాగు, మరోవైపు ముర్రేడు వాగుల వరద మేము ఉన్న గడ్డను చుట్టుముట్టాయి. చీకటి పడిన తర్వాత బతుకుపై ఆశలేదు. అదే సమయంలో బోట్లు మేము ఉన్నచోటికి రావడంతో బతికి బయటపడ్డాం. – ఈశ్వరయ్య, దంతెలబోరు

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు..



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

- గురువుల స్థానాన్ని పదిలపర్చుకోవాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఐడీఓసీలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు.. జాతీయ గురువులు అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. విద్యార్థుల హృదయాల్లో వారి స్థానాన్ని పదిలపర్చుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు తనకు గురువులుగా ఉన్న వారందరినీ పేరుపేరునా గుర్తు చేసుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ తనలాగే విద్యార్థులంతా వారిని జ్ఞాపకం పెట్టుకుంటారని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరి నుంచి ఏదో ఒకటి నేర్చుకుంటామని, వారు కూడా గురుసమానులేనని చెప్పారు. ఉపాధ్యాయులు సరికొత్త విషయాలను నేర్చుకుంటూ తరగతి గదిలో విశిష్ట బోధన చేయాలని, తద్వారా విద్యార్థుల హృదయాల్లో స్థానం సంపాదించుకుంటారని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తన విజయాన్ని కోరుకున్నారని, ఉపాధ్యాయులంటే తనకు ఎనలేని గౌరవమని చెప్పారు. గురువులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. గతంలో విద్యార్థులు బడికి రాకుంటే గురువులు వారింటికి వెళ్లి తీసుకొచ్చేవారని, ప్రస్తుతం పిల్లలను మందలించలేని స్థాయికి విద్యావ్యవస్థ మారిందని తెలిపారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ తమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల నివేదికను సమర్పించారు. 2022, 2023, 2024 విద్యా సంవత్సరాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 100 మందిని సన్మానించి, ప్రశంసా పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు గత రెండేళ్లలో రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తున్నామని చెప్పారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్.సతీష్‌కుమార్, విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ షేక్ సైదులు, వివిధ శాఖల అధికారులు అన్నామణి, మాధవరావుతో పాటు డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురువులే మార్గదర్శకులు

ఐటీడీఏ పీఓ రాహుల్



ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్న పీఓ

భద్రాచలంటౌన్: జీవితాన్ని సరైన దారిలో పెట్టి నడిపించేది గురువులేనని, అందరికీ వారే మార్గదర్శకులని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గిరిజన భవన్‌లో గురువారం నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు లేకుండా దేశంలో ఎవరూ ముందుకు పోలేరని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల అభివృద్ధికి 35 ఏళ్లుగా ఉపాధ్యాయుల ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు దిలీప్ కుమార్, మణెమ్మ, నాగార్జున రావు, కిరణ్ కుమార్, రమణయ్య, అశోక్ కుమార్, రాధమ్మ, చంద్రమోహన్, జహీరుద్దీన్, అలివేలు మంగతాయారు పాల్గొన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

భద్రాచలం: గిరిజన మహిళలు సొసైటీల ద్వారా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా చేయూతనిస్తామని పీఓ రాహుల్ తెలిపారు. దుమ్ముగూడెం మండలం మారాయిగూడేనికి చెందిన దుర్గాభవాని సెంట్రింగ్ యూనిట్ సభ్యులకు గురువారం ఎంఎస్‌ఎం యూనిట్ కింద బ్యాంకు రుణం చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదుగురు మహిళలు సొసైటీ ఏర్పాటు చేసుకుని సెంట్రింగ్ యూనిట్ ద్వారా జీవనోపాధి పొందడం అభినందనీయమని అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు మహిళలు ముందుకొస్తే అనుభవం ఉన్న పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, యూనిట్ సభ్యులు అపక వెంకటమ్మ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..

- భద్రాచలం వద్ద గోదావరి దోబూచులాట
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం ఒకేరోజు సుమారు పది అడుగులు పెరిగి, మళ్లీ తగ్గుముఖం పట్టింది. గురువారం మళ్లీ నెమ్మదిగా పెరిగింది. ఉదయం 43.3 అడుగుల నుంచి నెమ్మదిగా పెరుగుతూ రాత్రి 10 గంటలకు 44.9 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా, 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటిమట్టం స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. గోదావరి తగ్గుతూ, పెరుగుతుండడంతో ముంపు కాలనీల వాసులు భయాందోళన చెందుతున్నారు. నీటి మట్టం ఎంత మేర వస్తుందనేది అధికారులకు సైతం సరైన అంచనా లేకపోవడంతో ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

డీపీఓ చంద్రమౌళి



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ

ఇల్లెందురూరల్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని డీపీఓ చంద్రమౌళి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ఆన్‌లైన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. పంచాయతీ, వార్డుల వారీగా ఓటర్ల విభజనలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఓటరు జాబితా ప్రచురణల తేదీలను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఫొటో ఓటరు జాబితా డ్రాఫ్ట్‌ను ఈ నెల 13న గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించాలని, 14 నుంచి 21వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించాలని చెప్పారు. 26న అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి స్థాయిలో పూర్తిగా పరిష్కరించి 28న ఫొటో ఓటరు జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో డీఎల్‌పీఓ రమణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాలిపేరుకు భారీగా వరద

లక్ష క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్ నుంచి విడుదల



ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న వరద

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమ, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరద ప్రవాహం తగ్గినట్లే తగ్గి మళ్లీ ఉధృతమైంది. గురువారం తెల్లవారుజామునుంచి ప్రాజెక్ట్ 24 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచి 1,03,460 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని 71.92 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రాజెక్ట్ డీఈ తిరుపతి తెలిపారు.

కిన్నెరసాని ప్రాజెక్ట్ నాలుగు గేట్ల నుంచి వరద

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో 20 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ గురువారం 405.10 అడుగులకు చేరింది. దీంతో నాలుగు గేట్లు ఎత్తి 28వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, దిగువకు వదిలిన వరద రాజాపురం, యానంబైల్ వద్ద లో లెవల్ చప్టాపై ఉధృతంగా ప్రవహించడంతో 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవే ట్ ఐటీఐల్లో ప్రవేశాలకు నాలుగు దఫా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన దరఖా స్తుల ఆన్‌లైన్ ప్రక్రియ గురువారం మొదలుకాగా 20వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈనెల 11 నుండి 20వ తేదీ వరకు ప్రవేశాలు ఉంటాయని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://iti.telengana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. క్రాఫ్ట్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్‌కు 01-08-2024 నాటికి 14 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు.

ఉత్తమ పీఈటీగా నాగలక్ష్మి



అవార్డు అందుకుంటున్న బేతంపూడి ఉన్నత పాఠశాల పీఈటీ నాగలక్ష్మి

టేకులపల్లి: మండలంలోని బేతంపూడి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.నాగలక్ష్మి జిల్లా ఉత్తమ పీఈటీగా ఎంపికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఈఓ వెంకటేశ్వరాచారి చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. అవార్డు రావడంపట్ల హెచ్ఎం తారాసింగ్, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, సరోజ్‌కుమార్, సైదులు, గోపాల్, హైమావతి, అన్నపూర్ణ, సురేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

1,117 పాఠశాలలకు ఉచిత విద్యుత్

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్లకు సంబంధించిన 1,117 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందనుంది. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ నిధుల నుంచి విద్యుత్ బిల్లును చెల్లించేవారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రకటనతో ఉచిత విద్యుత్ ప్రభుత్వ పాఠశాలలకు అందనుండగా, జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాధికారి హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ అధ్యాపక అవార్డు స్వీకరించిన ఖుర్షీద్



అవార్డు అందుకుంటున్న ఖుర్షీద్

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన జిల్లాకు చెందిన ఎండీ.ఖుర్షీద్ గురువారం బెస్ట్ లెక్చరర్ అవార్డు స్వీకరించారు. హైదరాబాద్ రవీంద్రభారతీలో జరిగిన కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి 'తో మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందడం తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.


పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

ఖాకీల గుప్పిట్లో కరకగూడెం..!

- ఎన్‌కౌంటర్ ఘటనతో భారీ బందోబస్తు
- అటవీ ప్రాంతంలో పోలీసుల కూంబింగ్
- భయాందోళనలో ఏజెన్సీ వాసులు



ఎన్‌కౌంటర్ జరిగిన అటవీ ప్రాంతం ఇదే..

కరకగూడెం: మండల పరిధిలోని రఘునాథపాలెం, మోతె, తాటిగూడెం గ్రామాల సరిహద్దులో గల దోనాల అటవీ ప్రాంతంలో కాల్పులమోతతో ఏజెన్సీ వాసులు ఉలిక్కిపడ్డారు. గురువారం తెల్లవారుజామున దోనాల అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో అరుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో పార్టీ మణుగూరు ఏరియా కార్యదర్శి లచ్చన్న దంపతులు కూడా ఉన్నారు. ఈ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు గ్రేహౌండ్స్ దళాలు కరకగూడెం అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు జరిగినట్టు తెలుస్తోంది. కాల్పుల్లో ఇద్దరు పోలీసులకు సైతం తీవ్ర గాయాలు కాగా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మావోయిస్టుల మృతదేహాలను ఘటనా స్థలం నుంచి ట్రాక్టర్ల ద్వారా కరకగూడెం పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి మణుగూరుకు తరలించారు.

కొంత కాలంగా ప్రశాంతం..

గత కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న కరకగూడెం ఏజెన్సీ ప్రాంతంలో మళ్లీ తుపాకుల మోతతో మన్యం ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలో గత రెండు రోజుల నుంచే పోలీసులు ముమ్మరంగా పర్యటిస్తుండడం, ప్రతేక్య బలగాలను మోహరించడంతో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు భయపడ్డారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఎదురుకాల్పులు జరగగా, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి పోలీస్ అధికారులంతా ఇక్కడే మకాం వేసి మండలాన్ని వారి గుప్పిట్లోకి తీసుకున్నారు. ఎస్పీ రోహిత్‌రాజ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

బాంబుల మోతతో ఉలిక్కిపడ్డాం



గురువారం ఉదయం ఒక్కసారిగా కాల్పుల మోత మోగడంతో ఉలిక్కిపడ్డాం. ఏం జరుగుతుందోనని అందరం భయాందోళనకు గురయ్యాం. ఆ తర్వాత పోలీసుల మోహరింపుతో మావోయిస్టులు అటవీ ప్రాంతంలో సంచరించారనే విషయం తెలిసింది. – ఆవుల వెంకన్న, మోతె



రఘునాథపాలెంలో పోలీస్ వాహనాలు

ఏం జరుగుతుందో తెలియలే..



అటవీ ప్రాంతంలో తుపాకుల శబ్దాలు రావడంతో ఏం జరుగుతోందో మొదట అర్థం కాలేదు. పోలీసులు గ్రామాల్లో మోహరించడం, వాహనాల్లో బలగాలు రావడంతో అటవీ ప్రాంతంలో పోలీసులకు – మావోయిస్టులకు మధ్య కాల్పులు జరుగుతున్నాయని తెలిసింది. – పయ్యావుల ప్రశాంత్, మోతె

తెప్పసాయంతో చెరువులోకి వెళ్లి..

మరమ్మతులు చేపట్టిన విద్యుత్ సిబ్బంది



చెరువులో ఉన్న స్తంభం ఎక్కి ఇన్సులేటర్ బిగిస్తున్న లైన్‌ఇన్‌స్పెక్టర్ రమేష్

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ రామాలయం ఫీడర్‌కు గురువారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమస్యను గుర్తించేందుకు ట్రాన్స్‌కో అధికారులు కొద్దిసేపు ఇబ్బంది పడ్డారు. లలితాపురం చెరువులో ఉన్న స్తంభంపై 11కేవీ ఇన్సులేటర్ లేకపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు గుర్తించారు. దీంతో ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఏఎల్ఎం రాజశేఖర్ తెప్పసాయంతో చెరువులోకి వెళ్లి స్తంభం ఎక్కి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రమాదకర పరిస్థితి ఉన్నా వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా సమస్యను పరిష్కరించిన సిబ్బందిని ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ రాము అభినందించారు.

సత్తుపల్లిలో ఆక్రమణలు తొలగింపు



నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: హైదరాబాద్‌లో ఆక్రమణదారులను వణికిస్తున్న హైడ్రా తరహాలోనే సత్తుపల్లిలో మున్సిపల్ యంత్రాంగం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు, టీపీఓ రాజు, ఏఈ సురేష్ తదితరులు గురువారం సాయంత్రం స్థానిక గౌతమ్ స్కూల్ రోడ్డులో డ్రెయినేజీలపై చేపట్టిన నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయించారు. ఎన్టీఆర్ నగర్ శివారు నివాసాల సమీపానికి, ఖాళీస్థలాల్లోకి చిన్న వర్షం వచ్చినా వరద చేరుతోంది. దీంతో స్థానికులు ఆందోళనకు దిగడమే కాక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు డ్రెయినేజీలపై నిర్మాణాలతోనే నీరు ముందుకు సాగడం లేదని గుర్తించి జేసీబీతో కూల్చివేయించారు.

గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద గురువారం ఖమ్మానికి చెందిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారులో 50 కిలోల గంజాయి తరలిస్తుండగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ శాఖ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదగా హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు.

బూర్గంపాడులో..

బూర్గంపాడు: మండల పరిధిలోని సంజీవరెడ్డిపాలెం వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ మోటార్‌సైకిల్‌పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. మరో వ్యక్తి పరారయ్యాడు. వారి వద్ద సోదా చేయగా 12.50 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులు హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన కాసోజు వంశీ, గోరటి మల్లికార్జునగా గుర్తించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. పారిపోయిన వ్యక్తి కోసం వెతుకుతున్నామని పేర్కొన్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ 3.12 లక్షలు ఉంటుందని, మోటార్‌సైకిల్‌ను, గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచరూరల్: గంజాయితో పట్టుబడ్డ అంతరాష్ట్ర స్మగ్లర్లను రిమాండ్‌కు పంపినట్లు సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి కొత్తగూడెం ద్విచక్రవాహనంపై తరలిస్తున్న పది కేజీల గంజాయిని బుధవారం మండల పరిధిలోని సోములగూడెం క్రాస్‌రోడ్డు వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన జగన్నాథ్ బైపారి, లాలుతంతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: మండలంలోని 21 పిట్ విజయలక్ష్మీనగర్‌కు చెందిన మేడి మౌనిక తన భర్త అత్తామామలు అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పూర్వాపరాలు విచారించిన సీఐ బత్తుల సత్యనారాయణ మౌనిక భర్త శ్రావణ్‌కుమార్, అత్తామామలు భాస్కర్‌రావు, అరుణలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు బోల్తా

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క –సారలమ్మ గద్దెల సమీపంలో ప్రధాన రహదారిపై గురువారం అడ్డుగా వచ్చిన కోతులను తప్పించబోయి కారు బోల్తా పడింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు నుంచి పాల్వంచకు హుస్సేన్, అతని కుటుంబ సభ్యులు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో సమ్మక్క గద్దెల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో హుస్సేన్‌కు స్వల్ప గాయాలు కాగా, మిగతా నలుగురు సురక్షితంగా బయటపడ్డారు.

బురదలో జారిపడిన మహిళ మృతి



వసంత (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ధంసలాపురం వద్ద మంగళవారం ద్విచక్రవాహనంపై వెళ్తుమున్నేటి వరదతో చేరిన బురద కారణంగా జారిపడడంతో తీవ్రంగా గాయపడిన గుర్రం వసంత(37) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన ఆమె తన నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మంలో సుతారి పనులు వెళ్లే సమయాన ఈ ప్రమాదం జరిగింది. ఈమేరకు ఘటనపై ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన వసంత మృతి చెందడంతో గ్రామస్తులు ఆమె మృతదేహంతో గురువారం ఖమ్మం-బోనకల్ ప్రధా న రహదారిపై ధర్నా చేశారు. వరదల కారణంగా మృతి చెందిన వారి మాదిరిగా వసంత కుటుంబానికి కూడా రూ.5 లక్షల పరిహారం చెల్లించి ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గంటపాటు సాగిన ధర్నాతో రెండువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, చింతకాని ఎస్సై నాగుల్‌మీరా చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

గాయపడిన పోలీసులకు భద్రాచలంలో చికిత్స



గాయపడిన పోలీసులను అంబులెన్స్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: కరకగూడెం అటవీ ప్రాంతంలో గురువారం మావోయిస్టులు – పోలీసులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా, ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులు గాయపడ్డారు. వీరిని భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. ఇందులో గ్రేహౌండ్ కానిస్టేబుల్ వంశీకి కడుపు భాగంలో గాయమైనట్లు తెలుస్తుండగా ఐదుగురు సభ్యులతో కూడిన వైద్య బృందం పేగుకు సంబంధించిన శస్త్రచికిత్స చేశారని సమాచారం. ఈ సమయంలో ఆస్పత్రి ప్రాంతాన్ని పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ రోహిత్‌రాజు, ఓఎస్డీ పరితోష్ పంకజ్, ఏఎస్పీ అంకిత్ కుమార్, సీఐ సంజీవరావు ఉండి పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా మెరుగైన వైద్యం నిమిత్తం ఇద్దరిని హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. మరోపక్క గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు ఉన్నతాధికారులు, కానిస్టేబుళ్ల బంధువులు సైతం భద్రాచలం వచ్చారు.

మణుగూరు చేరిన మృతదేహాలు

మణుగూరు టౌన్: కరకగూడెం మండలంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన నక్సలైట్ల మృతదేహాలను గురువారం రాత్రి 9.45గంటలకు మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ సునీల్ ఆధ్వర్యాన పోస్టుమార్టం నిర్వహించారు. ఇది అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. శుక్రవారం ఉదయం వారి మృతదేహాలను బంధువులకు అప్పగించే అవకాశముంది.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి మృతి



దుర్గరాజం(ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిటైర్డ్ కార్మికుడు, తెలంగాణ ఉద్యమకారుడు, ఏఐటీయూసీ నాయకుడు ఎం.దుర్గరాజం (73) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ నాయకులు రామవరంలోని ఆయన స్వగృహంలో ఉన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుర్గరాజం కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందు వరుసలో ఉండేవారని గుర్తుచేశారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్నాడని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎస్‌కే సాబీర్‌పాష, మొక్కల వెంకటయ్య, దొమ్మేటి నాగేశ్వరరావు, ఆణ్యం లక్ష్మీనారాయణ, బరిగెల సంపూర్ణ, పాటి మోహన్‌రావు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు..



శశికాంత్‌రెడ్డి (ఫైల్)

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన పేరం నర్సిరెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు పేరం శశికాంత్‌రెడ్డి(17) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి పాల్వంచ నుంచి బంజరకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఇందిరానగర్ కాలనీ సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కల్లూరురూరల్: కల్లూరులోని ఇంటర్నెట్ సెంటర్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. జూలూరుపాడు మండలం పెద్ద తండాకు చెందిన బోడ భవానీప్రకాష్(25), కల్లూరుకు చెందిన ఎస్.కే.లాల్‌మహ్మద్ కల్లూరులోని ఇంటర్నెట్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. వీరిలో భవానీప్రకాశ్ సీహెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో నివాసముంటుండగా బుధవారం రాత్రి 8గంటలకు లాల్‌మహ్మద్ గదికి వెళ్లి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆయన తండ్రి బోడ రాముకు సమాచారం ఇచ్చాడు. ఘటనపై గురువారం రాము ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కల్లూరు ఎస్సై ఎస్.కే.షాకీర్ తెలిపారు. అయితే, భవానీప్రకాశ్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ఉప్పొంగుతున్న వాగులు

- కూలుతున్న విద్యుత్ స్తంభాలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు



వాగొడ్డుగూడెం వద్ద వరదనీటిలో మునిగిన లోలెవల్ చప్టా

అశ్వారావుపేటరూరల్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పలుచోట్ల వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అశ్వారావుపేట మండలంలోని వాగొడ్డుగూడెం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో లోలెవల్ చప్టా వరదనీటిలో మునిగిపోయింది. వాగొడ్డుగూడెం నుంచి అశ్వారావుపేటకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఊట్లపల్లి వద్దగల వెంకమ్మ చెరువుకు వరదనీరు పోటెత్తడంతో అలుగు ఉధృతంగా పారుతోంది. అనంతారం, నారాయణపురం, ఖమ్మంపాడు గ్రామాల్లోని పెదవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాలతో వినాయకపురంలోని పల్లె ప్రకృతి వనం వద్ద మూడు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో గురువారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు తక్షణమే స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పునరావాస కేంద్రానికి గ్రామస్తులు



మిల్లుగుంపు గ్రామస్తులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

పినపాక: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. పినపాక గ్రామపంచాయతీలోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెవెన్యూ అధికారులు మిల్లు గుంపు గ్రామస్తులను గురువారం పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అధికారులు ట్రాక్టర్‌పై వెళ్లి గ్రామం ఖాళీ చేయించారు. గోపాలరావు పేట గ్రామంలో మారేడుబాక చెరువు నిండింది. చెరువు కట్ట కోతకు గురవుతుందేమోననే ఆందోళనలో గ్రామస్తులు ఉన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చెరువు వద్దకు చేరి పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు ఇరిగేషన్ అధికారులు చెరువు కట్ట తెగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఏ క్షణమైన ఇబ్బంది కలిగితే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

సీపీఆర్ చేసి.. మిత్రుడిని కాపాడి..



సత్యనారాయణకు సీపీఆర్ చేస్తున్న స్నేహితులు

పాల్వంచ: గుండెపోటు రావడంతో కుప్పకూలిన వ్యక్తికి స్నేహితులు సీపీఆర్ చేసి ప్రాణాపాయం నుంచి కాపాడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరిగింది. పట్టణానికి చెందిన కడలి సత్యనారాయణ తన మిత్రులైన కో ఆపరేటివ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి కనకేష్, చింతా నాగరాజు కలిసి సొసైటీ కార్యాలయం వద్ద బుధవారం రాత్రి కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో సత్యనారాయణకు దగ్గు రావడంతో పాటు కార్డియాక్ అరెస్ట్ అయి గుండెపోటు వచ్చి పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన కాంపెల్లి కనకేష్, చింతా నాగరాజు సీపీఆర్ (గుండెను చేతులతో నొక్కడం) చేశారు. దీంతో కాసేపటికే సత్యనారాయణ స్పృహలోకి రాగా, పట్టణంలోని విజయ కేర్ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో పాటు హార్ట్ స్ట్రోక్ వచ్చిందని, అయినా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. సకాలంలో స్నేహితుడికి సీపీఆర్ చేసిన మిత్రులను పలువురు అభినందించారు.

ఆర్‌ఎంపీలు పరిధి దాటొద్దు

డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్



నవభారత్ వద్ద క్లినిక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్

పాల్వంచ: వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆర్‌ఎంపీలు తమ పరిధి దాటి వైద్యం చేస్తే సహించేది లేదని డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని శేఖరం బంజరలో జశ్వంత్ అనే నాలుగు సంవత్సరాల బాలుడికి ఆర్‌ఎంపీ వైద్యుడు సతీష్ ఇంజక్షన్ ఇవ్వడంతో, ఇన్ఫెక్షన్ అయి మృతి చెందాడు. దీంతో బాలుడి మృతికి కారణమైన ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు జిల్లా వైద్యాధికారికి గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో డీఎంహెచ్‌ఓ గురువారం నవభారత్ వద్ద ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్‌ను సందర్శించగా తాళం వేసి ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుడి మృతి బాధాకరమని అన్నారు. పరిమితికి మించి వైద్యం చేయడం, క్లినిక్‌లు ఏర్పాటు చేసుకోవడం, సెలైన్లు, ఇంజక్షన్లు వేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ బాలాజీ నాయక్, డిప్యూటీ డెమో ఎండీ.ఫయాజుద్దీన్, శేఖరం బంజర పీహెచ్‌సీ వైద్యులు కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో క్లినిక్‌లపై దాడులు

చుంచుపల్లి: ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై గురువారం వైద్యశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని విద్యానగర్‌లోని మూడు క్లినిక్‌ల్లో డిప్యూటీ డెమో ఎండి.ఫైజ్ మోహియుద్దీన్‌ల బృందం తనిఖీలు నిర్వహించింది. ఆర్‌ఎంపీలు ప్రాథమిక చికిత్సకు మించిన వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. వారికి నోటీసులు జారీ చేస్తామని డిప్యూటీ డెమో తెలిపారు.